# నమస్తే తెలంగాణ

## భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, శుక్రవారం 8 నవంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM




డీఈవో ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న తొలగింపు ఉపాధ్యాయులు



సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు, పక్కన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

# ఏడుగురు ఔట్.. పదిమంది ఇన్..

- డీఎస్సీ-2024 ఎల్పీ హిందీలో అర్హత లేదంటూ టర్మినేషన్ ఉత్తర్వులు
- సర్టిఫికెట్లు పరిశీలించిన హెచ్‌ఎంలపై చర్యలకు ఆర్జేడీకి డీఈవో నివేదిక
- హెచ్‌ఎంల ద్వారా ఉత్తర్వులు.. విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు
- మా జీవితాలతో విద్యాశాఖ ఆడుకుంది : తొలగించిన టీచర్ల ఆవేదన
- గోప్యంగా ప్రక్రియ నిర్వహించిన ఖమ్మం జిల్లా విద్యా శాఖ
- 'సర్టిఫికెట్ల పరిశీలన సక్రమమేనా' అంటూ ముందే చెప్పిన 'నమస్తే'

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 7 : నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల కారణంగా అర్హత లేని వారికి ఉద్యోగాలు వచ్చాయి. దీంతో అర్హత కలిగిన అభ్యర్థులు పోరాడారు. ఫలితంగా విచారణ జరగడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అనర్హుల ఉద్యోగాలు పోయాయి. అర్హులకు కొలువులు లభించాయి. కీలకమైన సర్టిఫికెట్ల పరిశీలన దశలోనే అనర్హులను తిరస్కరించాల్సి ఉంది. కానీ వారికి నియామకపత్రాలు అందజేశారు. సుమారు పదిహేను రోజులు ఉద్యోగం చేసేలా వ్యవహరించారు. తరువాత వ్యవహారం బయటకు వచ్చింది.

డీఎస్సీ 2024లో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), హిందీ లాంగ్వేజ్ పండిట్ (ఎల్పీ)లలో అర్హత లేదని పేర్కొంటూ ఏడుగురు అభ్యర్థులను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఖమ్మం డీఈవో తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానంలో అర్హులైన వారికి, పెండింగ్ స్థానాల్లో ఉన్న వారికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. దీంతో వారు గురువారం విధుల్లో చేరారు.

### ఎల్పీలో తప్పిదాలు..

డీఎస్సీ 2024లో భాగంగా హిందీ సబ్జెక్ట్‌లో జరిగిన తప్పిదాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. నియామక పత్రం అందజేస్తున్న సమయంలోనే ఒకరిని తొలగించారు. అర్హత లేదంటూ తాజాగా మరో ఏడుగురిని టర్మినేట్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో ఒకరిని, హిందీ ఎల్పీలో ఆరుగురిని తొలగించారు. ఆయా పోస్టుల్లో ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన డిగ్రీ, పీజీలో క్వాలిఫికేషన్ లేదని పేర్కొంటూ డీఈవో సోమశేఖరశర్మ టర్మినేషన్ ఉత్తర్వులను అందజేశారు. అక్టోబర్ 2 నుంచి 5 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగగా.. అక్టోబర్ 15న నియామక పత్రాలు అందజేశారు. వాటితో అక్టోబర్ 16న ఆయా స్కూళ్లలో రిపోర్ట్ చేసిన ఎల్పీలను సుమారు 24 రోజుల తర్వాత ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తొలగించిన వారిలో శ్రీదేవి, నాగేశ్వరరావు, రామలింగయ్య, వెంకటరత్నం, నాగలక్ష్మి, లావణ్య, నాగులుమీరా ఉన్నారు.

### విధుల్లో చేరిన 10 మంది ఉపాధ్యాయులు..

తొలగించిన వారి స్థానాల్లో అర్హులను నియమిస్తూ డీఈవో ఉత్తర్వులివ్వడం, వారు తక్షణమే విధుల్లో చేరడం వంటివి వెనువెంటనే జరిగిపోయాయి. ఎల్పీ హిందీలో ఏడుగురికి, స్కూల్ అసిస్టెంట్‌లో ముగ్గురికి నియామక పత్రాలు అందజేశారు. విధుల్లో చేరిన హిందీ ఎల్పీల్లో జేవీ శ్యామ్‌ప్రసాద్, బాజీ, షాహినాబేగం, పద్మ, నాగేశ్వరరావు, ఈశ్వరీబాయి, రామ్‌ప్రసాద్ ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్లలో వాజీర్, శిరీష, అర్షద్‌పాషా ఉన్నారు. అయితే, తాజాగా తొలగించిన ఏడుగురి స్థానాల్లో మరో ఏడుగురిని నియమించగా.. గతంలో పెండింగ్ ఉన్న మూడు స్థానాలకు ముగ్గురిని నియమించారు. మొత్తం 520 మంది ఉపాధ్యాయులకు జిల్లాలో నియామకపత్రాలు ఇవ్వాల్సి ఉంది. వారిలో 517 మందికి అక్టోబర్ 15 నాటి కౌన్సెలింగ్‌లో నియామకపత్రాలు అందించారు. కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో ఒకరికి, అర్హత లేదని గుర్తించడంతో మరొకరికి, డిగ్రీ సర్టిఫికెట్‌కి అర్హమైనది కాకపోవడంతో ఇంకొకరికి.. నియామపత్రాలు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారు. తాజాగా రిప్లేస్ చేస్తున్న ఏడుగురితో కలిపి ఈ ముగ్గురికి కూడా నియామక పత్రాలు అందించారు. దీంతో ఈ పదిమంది గురువారమే ఆయా హెచ్‌ఎంలకు రిపోర్టు చేసి విధుల్లో జాయిన్ అయ్యారు.

**ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'..**

డీఎస్సీ 2024 సర్టిఫికెట్ల పరిశీలన మొదలైనప్పటి నుంచి నియామకపత్రాలు అందించే వరకూ జరిగిన ప్రక్రియలో పలు తప్పిదాలు ఉన్నాయని, నిర్లక్ష్యం జరుగుతోందని 'నమస్తే తెలంగాణ' ముందే పేర్కొంది. వీటిపై వరుస కథనాలను కూడా ప్రచురించింది. 'సర్టిఫికెట్ల పరిశీలన సక్రమమేనా?' అనే శీర్షికన అక్టోబర్ 22న ప్రధాన కథనాన్ని ప్రచురించింది. సర్టిఫికెట్ల పరిశీలనలో చోటు చేసుకున్న లోపాలపై ఎత్తిచూపింది. ఈ క్రమంలో కలెక్టర్‌తో పాటు త్రీమెన్ కమిటీ విద్యాశాఖ అధికారులు స్పందించారు. హిందీకి సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనను మరోసారి క్షుణ్ణంగా నిర్వహించారు.



డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న తొలగించిన ఉపాధ్యాయులు

### తొలగించిన ఉపాధ్యాయుల ఆందోళన

ఉద్యోగంలోంచి తొలగించిన టీచర్లు.. డీఈవో కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం ఆందోళన చేశారు. తమ జీవితాలతో విద్యాశాఖ ఆటలాడుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాల్లో చెల్లుబాటు అవుతున్న సర్టిఫికెట్లు ఇక్కడెందుకు చెల్లుబాటు కావంటూ ప్రశ్నించారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలోనే చెప్పాల్సిన ఈ విషయాలను ఉద్యోగంలో చేరాక చెప్పడం.. తమను మానసిక క్షోభకు గురిచేస్తోందని వాపోయారు. 'సాక్షాత్తూ సీఎం చేతుల మీదుగా మాకు నియామకపత్రాలు ఇచ్చారు. ఇప్పుడు తొలగించామంటే కుదరదు. మా ఉద్యోగాలు మాకు ఇవ్వాలి' అంటూ నినాదాలు చేశారు.

### హెచ్‌ఎంలపై చర్యలకు సిఫార్సు

డీఎస్సీ 2024లో కొందరికి అర్హత లేకపోయినా వారు ఉద్యోగాలు పొందేందుకు కారణమైన ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలంటూ వరంగల్ ఆర్జేడీకి డీఈవో వివరాలు సమర్పించారు. సర్టిఫికెట్ల పరిశీలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ సమస్యలు ఉత్పన్నమయ్యాయని అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### గోప్యంగా ప్రక్రియ నిర్వహణ

అర్హతలేని టీచర్లను తొలగించి.. అర్హులైన వారికి నియామకపత్రాలు అందించిన ఈ ప్రక్రియను విద్యాశాఖ అధికారులు గోప్యంగా నిర్వహించారు. నూతన టీచర్లు గురువారం ఉదయమే విధుల్లో చేరేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించి వారిని అప్రమత్తం చేశారు. ఈ క్రమంలోనే విద్యాశాఖ అధికారులు తమ తప్పును కప్పి పుచ్చుకునేందుకు ప్రయత్నించారు. తొలగించిన టీచర్లు కోర్టును ఆశ్రయించకుండా ఉండేందుకే ఈ ప్రక్రియను అత్యంత గోప్యంగా నిర్వహించారు.

# అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ శ్రేణులపై తప్పుడు కేసులను ప్రజలు గమనిస్తున్నారు
- మా పార్టీ అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తాం..
- ఇల్లెందులో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

ఇల్లెందు రూరల్, నవంబర్ 7 : ఎన్నికల ముందు ప్రజలకు 420 అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులకు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. పట్టణంలోని సుభాష్ నగర్‌లో గల ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు శీలం రమేశ్ అధ్యక్షతన గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ తప్ప డైరెక్షన్ పాలన లేదని, సీఎం సీటుకే గ్యారెంటీ లేని పరిపాలన సాగుతున్నదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న మా పార్టీ క్యాడర్, నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురిచేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీని ఊరూరా మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు మరింతగా శ్రమించాలన్నారు. ఉప ఎన్నికలు వస్తే గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. రైతుబంధు, రైతుబీమా అమలు చేయడం లేదని, పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్, నాయకులు లకావత్ దేవీలాల్‌నాయక్, లక్కినేని సురేందర్, దాస్యం ప్రమోద్ కుమార్, నాయకులు ఖమ్మంపాటి రేణుక, ఘాజీ, సిలివేరి సత్యనారాయణ, జేకే శ్రీను, వల్లాల మంగమ్మ, పూనెం కమల, యలమద్ది రవి, అజ్మీరా బావ్‌సింగ్, కాంతారావు, నిట్ట భాస్కర్‌రావు, గిన్నారపు రాజేశ్, అబ్దుల్ నబి, హరికృష్ణ, నిఖిల్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ చట్టాన్ని.. పకడ్బందీగా అమలుచేయాలి

**జిల్లా స్థాయి సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 7: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల అంశంపై జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐడీవోసీలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలోఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం మాత్రమే కాకుండా వారి సంక్షేమం కోసం కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అయితే, ఎస్సీ, ఎస్టీలు ఆయా పథకాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు వారికి అవగాహన కల్పించేలా కృషి చేయాలని కోరారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్ రాజు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ జిల్లా కమిటీ సభ్యులు హాజరైన ఈ సమీక్షలో ఆర్డీవో మధు, ఏపీవో జనరల్ డేవిడ్ రాజు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అనసూయ, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్, సీపీవో సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

# తేమ శాతం నిబంధనలు ఎత్తివేయాలి

- ఏఎంసీలోనే సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి
- పత్తికి మద్దతు ధర విషయంలో మంత్రి తుమ్మల చొరవ చూపాలి
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా
- హాజరైన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్



మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 7 : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోనే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, జెండా పాట లేకుండా.. తేమ శాతం నిబంధనలు సడలించి పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతూ సీపీఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. తొలుత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7,521 చొప్పున లభించే పరిస్థితి లేదని, రూ.5 వేల నుంచి రూ.6,700లకు మాత్రమే ధర పలుకుతుండడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పత్తి రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కొనుగోళ్ల సమయంలో ధర నిర్ణయిస్తే.. కాంటాలు పెట్టేప్పుడు కోత పెట్టి రైతులకు నష్టం కలిగించడంపై మార్కెట్ కార్యదర్శి చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో తెగుళ్లు సోకి దిగుబడి తగ్గిందని, అరకొరగా చేతికొచ్చిన పంట అమ్మకాల్లోనూ రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేశ్, సీపీఎం నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, ఎర్రా శ్రీనివాసరావు, కృష్ణ, నర్సింహారావు, భూక్యా శ్రీనివాస్, ప్రసాద్, కే మీరా, ఊరడి సుదర్శన్‌రెడ్డి, ఉపేందర్, యాకయ్య పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

**సమీక్షలో డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయి**

ఖమ్మం రూరల్, నవంబర్ 7 : వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పీహెచ్‌సీల్లో మందుల పట్టిక, సిటిజన్ చార్జు, స్టాఫ్ వివరాలు ప్రదర్శించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతీబాయి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ప్రేరణ సమావేశ మందిరంలో పర్యవేక్షకులు, ఫార్మసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలు, ఉప కేంద్రాల్లో అందించే సేవలను హెచ్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేసి లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రణాళిక, కోల్డ్ చైన్ నిర్వహణ, వ్యాక్సిన్ పంపిణీ, ఇమ్యునైజేషన్ షెడ్యూల్ ఏఐఎఫ్ఐపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మందుల పంపిణీలో లోపం లేకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నమోదు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందునాయక్, డాక్టర్ రామారావు, సీహెచ్‌వో, హెచ్ఈవో, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతీబాయి

# రామయ్య హుండీల ఆదాయం రూ.1.3 కోట్లు



బ్యాంకు సిబ్బందికి డిపాజిట్ కోసం నగదు అందిస్తున్న ఈవో

భద్రాచలం, నవంబర్ 7 : భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ హుండీలను అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది లెక్కించగా రూ.1,03,21,415 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. ఆలయ ఆవరణలో పోలీసు భద్రత నడుమ హుండీల ఆదాయాన్ని గురువారం ఉదయం నుంచి లెక్కించినట్లు తెలిపారు. నగదుతోపాటు 90 గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి ఆభరణాలు, యూఎస్ డాలర్స్ 140, స్టెర్లింగ్ 10 పౌండ్లు, కువైట్ 2 దినార్లు, నేపాల్ 20 రుపీస్, ఇండోనేషియా 10,000 రూపియాలు వచ్చినట్లు పేర్కొన్నారు. లెక్కింపు అనంతరం భద్రాచలం ఎస్బీఐ అధికారులకు నగదును డిపాజిట్ నిమిత్తం అందజేసినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఈఈ రవీందర్, ఆలయ ఏవో భవానీకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ సాయిబాబా, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో రోడ్ల నిర్మాణం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మధిర, బోనకల్లులో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మధిర/బోనకల్లు, నవంబర్ 7 : భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతా ప్రమాణాలతో రోడ్ల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. చింతకాని, బోనకల్లు మండలాల్లో గురువారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. చింతకాని మండలంలో రూ.8.90 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బోనకల్లు మండల కేంద్రంలో రూ.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలు, పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా జిల్లాలో రోడ్ల నిర్మాణం, వెడల్పు చేసే పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ సమయంలోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు.


అనంతరం పలు సమస్యలపై సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో నరసింహారావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఈఈ జ్ఞానేశ్వర్, తహసీల్దార్ పొన్నం చందర్, ఎంపీడీవో రమాదేవి, ఎంఈవో పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మధిర : రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- నాణ్యమైన విద్యుత్ అందించండి
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి, హాజరైన విద్యుత్ శాఖ ఉద్యోగులు

ఖమ్మం రూరల్, నవంబర్ 7 : విద్యుత్ ప్రమాదాలపై నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే విధంగా చూడాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఎన్పీడీసీఎల్, ఓఅండ్ఎం అధికారులు, సిబ్బందికి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా విద్యుత్ వినియోగం అధికంగా పెరిగిందని, దీనికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ.. మరమ్మతుల కోసం నాణ్యమైన పరికరాలను వినియోగించాలన్నారు. ప్రధానంగా విద్యుత్ వైర్లు, ఇతర పరికరాలు, విడి విభాగాలు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. రోజువారీ విద్యుత్ సరఫరా ఎలా ఉంది? పూర్తిగా ఆగిపోతుందా? అవాంతరాలు తలెత్తుతున్నాయా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అనేది ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. సదస్సులో డైరెక్టర్ ఆపరేషన్స్ టి.మధుసూదన్‌రావు, డైరెక్టర్ హెచ్ఆర్‌డీ బి.అశోక్, చీఫ్ ఇంజినీర్ కిషన్, సురేంద్ర, చిన్నబాబు, డీఈలు, ఏడీఈలు పాల్గొన్నారు.

# ఐటీడీఏ ఎదుట ఆకలికేక దీక్ష

- పీఎంహెచ్ వర్కర్ల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్
- నలుగురు గిరిజన ఎమ్మెల్యేలున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన



భద్రాచలం ఐటీడీఏ ఎదుట దీక్షలు చేస్తున్న హాస్టల్ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

భద్రాచలం, నవంబర్ 7 : పోస్ట్ మెట్రిక్ హాస్టల్(పీఎంహెచ్) వర్కర్ల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ డెయిలీ వైజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వర్కర్లు గురువారం భద్రాచలం ఐటీడీఏ ఎదుట ఆకలికేక దీక్షలు ప్రారంభించారు. దీక్షలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి, జిల్లా కోశాధికారి జి.పద్మలు ప్రారంభించి మాట్లాడారు. వర్కర్లకు 17 నెలల వేతనాలు రావాల్సి ఉండగా.. వరుస సీఐటీయూ ధర్నాలకు స్పందించిన ఐటీడీఏ పీవో ఆరు నెలల వేతనాలు తన బడ్జెట్ ద్వారా చెల్లించారని గుర్తు చేశారు. ఇంకా మిగిలిన వేతనాలు ఇప్పటివరకు రాకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, 15వ తేదీలోగా చెల్లించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో నలుగురు గిరిజన ఎమ్మెల్యేలు ఉన్నా.. కనీసం వేతనాల గురించి స్పందించడం లేదని, ఈ విషయాన్ని వారు సీఎం దృష్టికి తీసుకెళ్లి వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, సీఐటీయూ నాయకులు ఎస్.నాగరాజు, జలందర్, రామ, శ్యామల, జయ, సుభద్ర, రాజ్యలక్ష్మి, స్వరూప, ఉదయలక్ష్మి, మున్నా, కృష్ణ, రాజేశ్, జ్యోతి పాల్గొన్నారు.